సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 12 । నవంబర్ । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

క్రీడలలో గెలుపు ఓటములు సహజమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
35.3 /15.3

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సర్వేను బహిష్కరించిన పెద్దదేవి సింగ్ తండా వాసులు

- గ్రామాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పెద్దదేవిసింగ్ తండావాసులు సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించడంతో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సోమవారం తండాను సందర్శించారు. తండా వాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. కులం పేరు విషయంలో వివాదం తలెత్తిన్నట్లు వారు సబ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆమె వరి కొనుగోళ్ల గురించి అడిగి తెలుసున్నారు. తండాలో ఉన్న సమస్యలు, పాఠశాలకు వెళ్లే రోడ్డు సమస్యలను స్థానికులు సబ్ కలెక్టర్ కిరణ్మయి దృష్టికి తీసుకొచ్చారు. అధికారులకు నివేదిక పంపించి సమస్యలను పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆమె వెంట తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, ఎంపీఎస్‌వో సాయిలు, జీపీ కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

కామారెడ్డి టౌన్: భిక్కనూరు మండలం కాచాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేసినట్లు డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యవహారంలో శ్రీనివాస్, కాంతారెడ్డిల పై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

ప్రిన్సిపల్‌కు మెమో



బీబీపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ విద్యార్థినులతో దురుసుగా ప్రవర్తించిన ప్రిన్సిపల్ మంగకు మెమో జారీ అయ్యింది. ఇటీవల ఉన్నతాధికారులు పర్యవేక్షణకు వచ్చిన సమయంలో ప్రిన్సిపల్ మంగతోపాటు వంట సిబ్బంది, అటెండర్ ప్రవర్తన బాగా లేదని ఇంటర్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వారు వెళ్లిన అనంతరం ప్రిన్సిపల్ విద్యార్థులను పిలిచి అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపిస్తూ ఆదివారం విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీంతో డీఈవో ఆదేశాల మేరకు ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఎంఈవో అశోక్ సోమవారం కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రిన్సిపల్‌కు మెమో జారీ చేశామని, భోజన సిబ్బంది, అటెండర్‌పైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉమ్మడి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

కామారెడ్డి అర్బన్: బాలల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి రాష్ట్ర స్థాయి కథలు, కవిత్వం పోటీలలో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్కే సన, ఎం.శ్రీజ ప్రతిభ చూపి బహుమతులు గెలుచుకున్నారని పాఠశాల హెడ్‌మాస్టర్ కమల, తెలుగు ఉపాధ్యాయురాలు సునీత తెలిపారు. ఈనెల 15న హైదరాబాద్ అబిడ్స్‌లోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించే కార్యక్రమంలో వీరు బహుమతులు అందుకుంటారని పేర్కొన్నారు.

'సర్వే గడువు పొడిగించాలి'

కామారెడ్డి అర్బన్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గడువు పొడిగించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, దేవులా ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సర్వే నిర్వహించడంలో ఎన్యుమరేటర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబాన్ని 75 ప్రశ్నలు అడగడానికి చాలా సమయం పడుతోందని తెలిపారు. మధ్యాహ్నం కుటుంబ యజమానులు అందుబాటులో ఉండడం లేదని, ఈ నేపథ్యంలో ఉదయం వేళ సర్వే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

20న పోలీస్ శాఖ పాత వాహనాల వేలం

కామారెడ్డి క్రైం:వినియోగానికి పనికి రాకుండా పడి ఉన్న పోలీస్ శాఖలోని మోటారు వాహనాలు, ఇతర బైక్‌లను ఈనెల 20న వేలం వేయనున్నట్లు ఎస్పీ సింధుశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో 20 న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు స్క్రాప్‌గా నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని, ఇతర వివరాలకు 87126 86114 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నిర్లక్ష్యపు తుప్పు..!



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రధాన కాలువ గేట్లు తుప్పుపట్టడంతో తరచూ మొరాయిస్తున్నాయి. దీంతో విలువైన జలాలు వృథా అవుతున్నాయి.

- మొరాయిస్తున్న నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు
- వృథా అవుతున్న నీరు
- స్టాప్‌లాక్ గేటు ఏర్పాటుతోనే వృథాకు చెక్

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల కోసం ఏర్పాటు చేసిన వరద గేట్లు తుప్పు పట్టాయి. హెడ్‌స్లూయిస్ జల విద్యుదుత్పత్తి కేంద్రానికి అనుసంధానంగా ఐదు వరద గేట్లు ఏర్పాటు చేశారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ గేట్లు తుప్పుపట్టాయి. ప్రాజెక్టు ఆయకట్టుకు వానాకాలం, యాసంగి సీజన్లలో సాగు నీరు విడుదల చేస్తుంటారు. అయితే ప్రధాన కాలువ గేట్లకు తుప్పు పట్టడంతో గేట్లు మొరాయిస్తున్నాయి. ప్రధాన కాలువ గేట్లు సక్రమంగా కిందికి దిగకపోవడంతో వందలాది క్యూసెక్కుల జలాలు వృథా అవుతున్నాయి.

ప్రధాన కాలువ గేట్ల ద్వారా వృథా అవుతున్న నీటిని అరికట్టేందుకు ఏటా రెండు, మూడు పర్యాయాలు విశాఖపట్నం నుంచి గజఈతగాళ్లను రప్పించి మరమ్మతులు చేయించాల్సి వస్తోంది. ఏటా నీటి వృథాను అరికట్టేందుకు రూ. 3 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులకే పరిమితం అవుతుండడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో ఆయకట్టు పంటలకు అందాల్సిన జలాలు మంజీర నది పాలవుతున్నాయి.



నిధులున్నా పనుల జాడేది?

నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువనుంచి నీరు లీక్ కాకుండా చూసేందుకు వరద గేట్ల సేఫ్టీ కోసం స్టాప్ లాక్ గేట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రధాన కాలువ గేట్ల ముందు స్టాప్ లాక్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. అయితే స్టాప్ లాక్ గేటుకు నిధులు వచ్చి ఏడాది కావస్తున్నా పనుల జాడ కరువయ్యింది. స్టాప్ లాక్ గేటు ఏర్పాటు చేస్తే ప్రధాన కాలువ ద్వారా నీటి వృథాను అరికట్టడంతో పాటు గేట్ల నిర్వహణకు ఎంతోగా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న హెడ్‌స్లూయిస్ జల విద్యుదుత్పత్తి కేంద్రం గేట్లు గతంలో మొరాయించడంతో జెన్‌కో అధికారులు స్టాప్‌లాక్ గేటును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి జెన్‌కో గేట్లు మొరాయించడం లేదు. ప్రధాన కాలువకు సైతం స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

నీరు ఖాళీ అయితేనే..

ప్రధాన కాలువ గేట్లు తుప్పపట్టడంతో మొరాయిస్తున్నాయి. అయితే ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వలతో నిండుకుండలా ఉంది. దీంతో స్టాప్ లాక్ గేటు ఏర్పాటు చేయడం సాధ్యం కావడం లేదు. ప్రాజెక్టు నీరు ఖాళీ అయిన తర్వాత పనులు చేపడతాం. – సోలోమన్, నిజాంసాగర్ నీటిపారుదలశాఖ ఈఈ

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

- ప్రతి ఇంటిని సర్వే చేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. ప్రతి ఇంటిని సర్వే చేయాలన్నారు. సోమవారం పట్టణంలోని 44 వ వార్డులో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశ్నావళి ప్రకారం ఆయా కుటుంబాల్లోని పూర్తి సమాచారాన్ని సేకరించాలన్నారు. తప్పులు లేకుండా సమాచారం సేకరించాలని సూచించారు. ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు 15 నుంచి 20 ఇళ్లలో సర్వే చేపట్టాలని సూచించారు. వేగంగా సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్ జనార్దన్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

ఉన్నత స్థానానికి చేరుకోవాలి

ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలను సోమవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఐఐటీ, ట్రిపుల్ ఐటీలలో సీటు సాధించేందుకు కృషి చేయాలన్నారు. చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, మైనారిటీ సంక్షేమశాఖ జిల్లా అధికారి దయానంద్, ఆర్ఎల్‌సీ కిరణ్ గౌడ్, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, ప్రిన్సిపాల్ ప్రణీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టార్పాలిన్‌లు, గోనె సంచులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. ట్యాబ్ ఎంట్రీలు త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య తెలిపారు. సోయా కొనుగోళ్లు సైతం ప్రారంభించామని మార్క్‌ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ మహేశ్ తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, ఇన్‌చార్జి డీఎస్‌వో నరసింహారావు, సహకార అధికారి రామ్మోహన్, డీపీఎం రమేశ్ బాబు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో మరో విషాదం

- హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్న జిల్లా విద్యార్థిని
- తమ కూతురును చంపేశారని తల్లి ఆరోపణ
- వ్యక్తిగత కారణాలతోనని అధికారుల ప్రకటన



స్వాతి ప్రియ (ఫైల్)

భైంసా/బాసర: బాసరలోని ట్రిపుల్ ఐటీలో మరో విద్యా కుసుమం రాలిపోయింది. పీయూసీ2 చదువుతున్న ఆర్మూర్ మండలం పెర్కిట్‌లోని తిరుమల కాలనీకి చెందిన పూరి స్వాతి ప్రియ(18) ఆదివారం అర్ధరాత్రి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణం చెందింది. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న కుటుంబీకులు ట్రిపుల్ ఐటీకి చేరుకున్నారు. వారిని సెక్యూరిటీ అధికారులు ప్రధాన గేటు వద్దనే నిలిపివేశారు. పుట్టెడు దుఃఖంతో వచ్చిన తల్లిదండ్రులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

తల్లిదండ్రులు రాకముందే తరలింపు..

స్వాతిప్రియ రోజూ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడేది. సోమవారం ఉదయం క్యాంపస్ అధికారులు ఫోన్ చేసి స్వాతిప్రియ ఆత్మహత్య చేసుకుందని తెలుపడంతో వారు షాక్ అయ్యారు. గంటలోపే బాసరకు చేరుకున్నారు. అయితే తల్లిదండ్రులు రాకముందే మృతదేహాన్ని క్యాంపస్ నుంచి భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.



ట్రిపుల్ ఐటీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న మృతురాలి తల్లి

తల్లి ఆరోపణలు

స్వాతిప్రియను క్యాంపస్ అధికారులే హత్యచేసి ఆత్మహత్యగా చెబుతున్నారని మృతురాలి తల్లి ఉజ్వల ఆరోపించారు. తాము రాకముందే మృతదేహాన్ని ఎందుకు తరలించారని ప్రశ్నించారు. ట్రిపుల్ ఐటీకి చేరుకున్న తమను లోపలికి ఎందుకు అనుమతించలేదని నిలదీశారు. కూతురు సెల్‌ఫోన్ ఇవ్వడం లేదని, సూసైడ్ నోట్ ఉందని చెప్పిన అధికారులు దానిని చూపించలేదన్నారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకునే అవకాశమేలేదన్నారు. ఆదివారమే తమతో ఫోన్‌లో మాట్లాడిందని ఉదయాన్నే ఎలా చనిపోయిందని ప్రశ్నించారు. క్యాంపస్ అధికారులు సాక్ష్యాలను మాయం చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తీవ్రంగా ఆరోపించింది.

బిచ్కుంద నుంచి వలస వచ్చి..



ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన స్వాతిప్రియ(18) బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఆత్మహత్యకు పాల్పడటంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. బిచ్కుంద మండలానికి చెందిన పూరి రవి, ఉజ్వల దంపతులు 14 ఏళ్ల క్రితం ఉపాధి కోసం పెర్కిట్‌కు వలస వచ్చారు. వీరికి సరస్వతి, స్వాతిప్రియ, ఓం సాయిరాం పిల్లలు ఉన్నారు. రవి ప్రైవేట్ ఆస్పత్రులకు ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండో కూతురు స్వాతిప్రియ బాసరలోని ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతోంది.

ఏబీవీపీ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే

నిజామాబాద్ నాగారం: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్య నేపథ్యంలో ఆందోళన చేసిన ఏబీవీపీ కార్యకర్తలపై ప్రైవేట్ సెక్యూరిటీ కర్రలతో దాడులు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సీఐ రాకేష్ అండదండలతోనే విద్యార్థులపై దాడి జరిగిందన్నారు. ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ దాడి, పోలీసుల లాఠీచార్జీలో గాయపడిన ఏబీవీపీ కార్యకర్త సాయికుమార్‌ను సోమవారం సాయంత్రం జీజీహెచ్‌కు తరలించగా ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బాసర ట్రిపుల్‌ఐటీలో తరచూ ఆత్మహత్య ఘటనలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలిసి కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యల వెనక ఉన్న కారణాలను నిర్ధారించడానికి విచారణ కమిటీ వేయాలన్నారు. లాఠీచార్జి చేసిన పోలీసులు, సెక్యూరిటీ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఏబీవీపీ ప్రముఖ్ రెంజర్ల నరేష్, న్యాయవాది జగన్‌మోహన్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్ తదితరులున్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పోలీసుల లాఠీచార్జి

విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు క్యాంపస్‌ను ముట్టడించారు. గేట్లవైపు వెళ్తున్న వారిని పోలీసులు, సెక్యూరిటీ గార్డులు అడ్డుకున్నారు. లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. ఈ ఘటనలో ఏబీవీపీ నాయకుడు సాయి కుమార్ తలకు తీవ్ర గాయమైంది. అతడిని చికిత్స కోసం నిజామాబాద్ తరలించారు.

భారీ భద్రత

స్వాతిప్రియ వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకుందని క్యాంపస్ అధికారులు ప్రకటించారు. ట్రిపుల్ ఐటీ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులను మోహరించారు. ఎవరినీ లోనికి అనుమతించలేదు. విద్యార్థిని స్నేహితులను కూడా బంధువులతో మాట్లాడించేందుకు నిరాకరించారని సమాచారం.



కొండాపూర్ బస్టాప్ వద్ద ఆటోలు ఉన్నా.. బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

'మహాలక్ష్మి' ఎఫెక్ట్!

గతంలో కాసేపట్లో బస్సు వస్తుందని తెలిసినా.. వేచి ఉండడానికి ప్రయాణికులు ఆసక్తి చూపేవారు కాదు. బస్సు వస్తున్నా ఆటోలో వెళ్లడానికే మొగ్గు చూపేవారు. ప్రభుత్వం 'మహాలక్ష్మి' పథకం అమలు చేశాక పరిస్థితి మారింది. బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండడంతో "కాస్త ఆలస్యమైనా పర్వాలేదు.. బస్సు వచ్చేంతవరకు వేచి చూస్తాం" అంటున్నారు మహిళా ప్రయాణికులు. రద్దీ ఎక్కువగా ఉన్నా బస్సుల్లో వెళ్లడానికే మొగ్గుచూపుతున్నారు. సోమవారం కామారెడ్డికి వెళ్లేందుకు పలువురు మహిళలు రాజంపేట మండలంలోని కొండాపూర్ బస్టాప్ వద్దకు వచ్చారు. అక్కడ ఆటోలు అందుబాటులో ఉన్నా వాటిలో వెళ్లకుండా బస్సుకోసం కొంతసేపు నిరీక్షించారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

లక్ష్యం నెరవేరేనా?

- జిల్లాలో 1.45 కోట్ల చేప పిల్లలు విడుదల చేయాలన్నది లక్ష్యం
- ఇప్పటివరకు 55 శాతమే పూర్తి
- చిన్న సైజ్ చేపపిల్లలు పంపిణీ చేస్తున్నారంటున్న మత్స్యకారులు
- చేప ఎదుగుదలపై ఆందోళన

బాన్సువాడ : ప్రభుత్వం మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది జిల్లాలో మొట్టమొదట బాన్సువాడ కల్కి చెరువులో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి చేప పిల్లలను చెరువుల్లో విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న చేపపిల్లలపై మత్స్యకారులు పెదవి విరుస్తున్నారు. చిన్నసైజువి పంపిణీ చేస్తుండడంతో అవి ఎదగడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 80 నుంచి 100 మిల్లీ మీటర్ల సైజులో ఉన్న చేప పిల్లలను సరఫరా చేయాల్సి ఉండగా.. కాంట్రాక్టర్లు అంతకన్నా తక్కువ సైజున్న చేప పిల్లలను విడుదల చేస్తున్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ అధికారులను మచ్చిక చేసుకుని తక్కువ సైజున్న చేపపిల్లల్ని చెరువుల్లో విడుదల చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బాన్సువాడ కల్కి చెరువులో చేప పిల్లల విడుదల సందర్భంగా ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. చేప పిల్లల సైజును కొలిచారు. తక్కువ సైజులో ఉండడంతో మత్స్యశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేప పిల్లలు తక్కువ సైజులో ఉంటే ఎక్కువ శాతం చనిపోయే ప్రమాదముందని, చిన్న సైజులో ఉన్న చేప పిల్లలను చెరువులలో వదలొద్దని అధికారులకు సూచించారు. చేప పిల్లల్ని తిప్పి పంపించాలని ఆదేశించారు. కానీ అధికారులు మాత్రం ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోగానే చిన్న సైజు చేప పిల్లలనే కల్కి చెరువులో వదిలి చేతులు దులుపుకున్నారు.



బాన్సువాడ కల్కి చెరువులో విడుదల చేసిన చిన్న సైజు చేప పిల్లలు (ఫైల్)

పెద్ద సైజ్‌వే వదులుతున్నాం

గతంలో చిన్న సైజ్ చేప పిల్లలు వచ్చాయి. దీంతో సీఎం రెండుసార్లు టెండర్ క్యాన్సిల్ చేయించారు. ఇప్పుడు పెద్దసైజ్‌వే వస్తున్నాయి. పెద్ద సైజ్ చేప పిల్లలనే చెరువుల్లో విడుదల చేస్తున్నాం. మత్స్యకారులు కూడా సంతోషంగా ఉన్నారు. – సత్యనారాయణ, అధ్యక్షుడు, జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం

వానాకాలం ముగిసినా..

జిల్లాలో 225 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పరిధిలో 15 వేల మంది మత్స్యకారులు సభ్యత్వం కలిగి ఉన్నారు. వీరికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏటా వర్షాకాలంలో చేప పిల్లలను ఉచితంగా అందిస్తోంది. జిల్లాలోని నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టులతోపాటు 798 చెరువుల్లో కలిపి ఈ ఏడాది 1.45 కోట్ల చేప పిల్లలను వదలాలన్నది సర్కారు లక్ష్యం. కాగా ఇప్పటివరకు 55 శాతమే లక్ష్యాన్ని చేరుకున్నారు. మరో వారంలో వందశాతం లక్ష్యాన్ని చేరుకుంటామని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఆలస్యంగా వేసే చేప పిల్లలు సరిగా ఎదగవన్న అభిప్రాయం మత్స్యకారుల్లో వ్యక్తమవుతోంది. గతంలో ఆలస్యంగా చేప పిల్లలను వదిలినప్పుడు అవి రెండు కిలోలకు మించి ఎదగలేదని వారు గుర్తు చేస్తున్నారు. ఈసారి మరింత ఆలస్యం కావడంతో రెండు కిలోలు కూడా ఎదుగాతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

క్రీడల అభివృద్ధికి తోడ్పాటు

- మానసిక, శారీరక ఉల్లాసానికి ఆటల పోటీలు దోహదం
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి
- అట్టహాసంగా టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


వాలీబాల్ షాట్ కొడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు అందులో భాగమేనని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల 10వ జోనల్ క్రీడా పోటీలు మండలంలోని కంజర్ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే భూపతిరెడ్డి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులతో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. జాతీయ, సొసైటీ, స్పోర్ట్స్ జెండాలను నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల స్వాగతోత్సవ నృత్యాలు, మార్చ్‌ఫాస్ట్ అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంజర గురుకులంలో జోనల్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జిల్లా నుంచి మలావత్ పూర్ణ, నిఖత్ జరీన్ తదితరులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. బాలికల విద్య సమాజానికి కీలకమని, ప్రభుత్వం ఇటీవల మెస్, కాస్మొటిక్ చార్జీలను 40శాతం పెంచిందని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్లు గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు, తహసీల్దార్ రామేశ్వర్, ఎంపీడీవో రాములు నాయక్, ఎంఈవో గేమ్‌సింగ్, సంస్థ డిప్యూటీ సెక్రెటరీ వనజ, ప్రిన్సిపాళ్లు, పీడీలు, పీఈటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల నుంచి క్రీడాకారులు

నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల్ జిల్లాల నుంచి 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో 1200 మంది క్రీడాకారిణులు అండర్–14, 17, 19 విభాగాల్లో పాల్గొననున్నారు. నాలుగు జిల్లాల్లోని 14 గురుకులాల నుంచి 9 అంశాల్లో క్రీడలు నిర్వహించనున్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

క్రీడల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురుకులం మొత్తం కలియతిరిగారు. డైనింగ్ హాల్, హాస్టల్, తరగతి గదులు, వెల్‌నెస్ సెంటర్, ఇతర అన్ని విభాగాలను పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యాప్రమాణాలు, విద్యార్థినుల స్థితిగతుల గురించి ప్రిన్సిపాల్ విజయ లలిత, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కళాశాలలో విద్యుత్ సరఫరా, టాయిలెట్లు, తాగునీటి ఇబ్బంది, డ్రెయినేజీ, తదితర అంశాలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. నెల రోజుల్లో తాగునీటి సరఫరాకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే హామీనిచ్చారు.


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే


మార్చ్‌పాస్ట్‌లో లెఫ్ట్ పోచంపాడ్ గురుకులం క్రీడాకారిణులు


కంజర గురుకులం క్రీడాకారిణులు..

క్లుప్తంగా

'నీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు'



భిక్కనూరు: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన శ్రీరాంనగర్ కాలనీకి వచ్చి నీటి ఎద్దడి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నీటి ఎద్దడి ఉన్న విషయాన్ని ఆర్‌టీఐ జిల్లా ప్రతినిధి తెలుసుకుని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు స్పందించి మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్‌ను హుటాహుటిన పంపించారు. ఆయన వచ్చి సమస్య తెలుసుకుని మూడు రోజుల్లో సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. వాటర్‌మన్ బత్తుల నాగభూషణం, యువజన సంఘాల ప్రతినిధులు ప్రశాంత్, సిద్ధరాములు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గ్రామ గ్రామాన విస్తరించాలి

- కామారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు విపుల్ జైన్



మాచారెడ్డి: ప్రతి కార్యకర్త వందకు పైగా సభ్యత్వాలు చేసి బీజేపీని గ్రామ గ్రామాన విస్తరించాలని కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ పిలుపునిచ్చారు. సోమవారం మండల బీజేపీ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదు ఘట్టం ముగింపు దశకు చేరిందన్నారు. ప్రస్తుతం క్రియాశీల సభ్యత్వం కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు వంద ప్రాథమిక సభ్యత్వాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 15 నుంచి బీజేపీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో బూత్‌ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తల సమక్షంలో బూత్ అధ్యక్షులను ఎన్నుకోవాలని సూచించారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు




పత్తి ఫ్యాక్టరీని మూసి నిరసన తెలుపుతున్న యజమానులు, ఆందోళన చేస్తున్న పత్తి రైతులు

- సీసీఐ నిబంధనలతో నష్టపోతామంటున్న వ్యాపారులు
- ఫ్యాక్టరీలకు తాళాలు వేసి నిరసన
- ఆందోళన చెందుతున్న రైతులు

మద్నూర్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిబంధనలకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలోని పత్తి ఫ్యాక్టరీల యాజమానులు ఫ్యాక్టరీలకు తాళాలు వేసి పత్తి కొనుగోళ్లు నిలిపివేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో సీసీఐ పెట్టిన నిబంధనలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ నిబంధనలతో పత్తి ఫ్యాక్టరీలకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ కాటన్ అసోసియేషన్ పత్తి కొనుగోళ్ల బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. నిబంధనలు సడలించే వరకు పత్తి కొనుగోలు చేయబోమని పేర్కొన్నారు. వ్యాపారులు తీసుకున్న ఈ నిర్ణయంతో మార్కెట్‌కు పత్తిని తీసుకువచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పత్తి కొనుగోళ్ల బంద్ విషయంలో మార్కెట్ కమిటీ అధికారులు రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తిని కొనుగోలు చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన వాలీబాల్ బాలుర జట్టు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన వాలీబాల్ బాలికల జట్టు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం వాలీబాల్ అండర్–14 బాల, బాలికల రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేసినట్లు పాఠశాల పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన బాల బాలికలకు పేట్‌సంగెంలో పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను రాష్ట్ర స్థాయి జట్లకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఉమ్మడి నిజామాబాద్ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.


మనుశ్రీని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నిర్మల్‌లో ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి మనుశ్రీ ఉత్తమ ప్రతిభ చూపి క్యాంస పతకం సాధించింది. దీంతో మనుశ్రీని పాఠశాల హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డితోపాటు పీడీ సభాత్‌క్రిష్ణ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

● ఏం రాసుకుంటుండ్రో..



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ఇంటికొచ్చిన సారుకు కుర్చీ వేసి కూర్చోబెట్టారు. ఎండపొడకు కూసున్న ముసలవ్వ ఏం రాసుకుంటుండ్రో అన్నట్టుగా ఆసక్తిగా వాళ్ల వంక చూస్తోంది. ఆమె కుమారుడు, కుటుంబ సభ్యులందరి పేర్లు రాయించాడు. అవ్వకు సంబంధించినవీ రాయించాడు. మనవలు ముసలమ్మకు వివరంగా చెప్పేసరికి అట్లనా అంటూ పింఛన్ అస్తది కదా అంటుంటే నీ పింఛన్ ఏడికీ పోదే అంటుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం అర్గొండ గ్రామంలోని దృశ్యమిది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ (టైలరింగ్)ను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ అన్నారు. టైలరింగ్ శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు మహిళలు 30 రోజులపాటు కొనసాగే శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ సౌకర్యం పూర్తిగా ఉచితంగా అందజేస్తారన్నారు. ఇతర వివరాలకు 08461 295428 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): పాత కక్షలతో ఒకరిని హత్య చేసిన ఇద్దరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి సోమవారం తీర్పును వెలువరించారు. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 2021లో శక్కర్‌నగర్ చౌరస్తా సమీపంలోని సులభ్ కాంప్లెక్స్ వద్ద పట్టణానికి చెందిన సయ్యద్ అజార్ అనే వ్యక్తిని అదే కాలనీకి చెందిన సతీశ్, అబ్దుల్ జావిద్ కల్లుసీసాతో కడుపులో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారని, బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాలు రుజువు కాడంతో నిందితులకు 5ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.100 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సిరికొండ అజయ్ అలియాస్ రంజిత్‌ను చోరీ కేసులో అరెస్టు చేసినట్లు ఎస్సై అనిల్ సోమవారం తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘ భవనం తాళాలు పగులగొట్టి రూ.30 వేల విలువైన సౌండ్‌సిస్టంను అజయ్ ఎత్తుకెళ్లాడన్నారు. తాము వాహనాలను తనిఖీ చేస్తుండగా సౌండ్ సిస్టంను విక్రయించేందుకు వెళ్తూ రంజిత్ పట్టుబడ్డాడని ఎస్సై తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట సమీపంలో ఉన్న జగ్గనిచెరువు వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహ కనిపించిందని ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుందని, వివరాలకు తమను సంప్రదించాలన్నారు.

బాసర రైల్వేస్టేషన్‌లో బాలుడు



ఖలీల్‌వాడి: నిర్మల్ జిల్లా బాసర రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు బాలుడిని వదిలి వెళ్లినట్లు ఎస్సై సాయిరెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం సాయంత్రం బాసర స్టేషన్‌కు చేరుకున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ కోచ్–6లో గుర్తు తెలియని వ్యక్తులు రెండేళ్ల బాలుడిని వదిలి వెళ్లారు. ఏడుస్తున్న బాబును గమనించిన రైల్వే పోలీసులు అతడి సంబంధీకులు ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీశారు. చివరకు నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చి చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. బాబు సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను (87126 58591) సంప్రదించాలని ఎస్సై సాయిరెడ్డి సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. నగరంలోని అజాం కాలనీలోని ఐస్ ఫ్యాక్టరీ వద్ద మినీ ట్రక్కులో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. అఫ్సర్ అనే వ్యక్తికి సంబంధించిన 70 బస్తాల బియ్యాన్ని తరలిస్తున్న అమీర్ మహ్మద్ అలియాస్ చావూస్ అదుపులోకి తీసుకుని బియ్యంతోపాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

పేకాటస్థావరంపై దాడి

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని కోటార్మూర్‌లో కొనసాగుతున్న పేకాటస్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.26,860 నగదుతోపాటు 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. కథగావ్ మంజీరా వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేసి చిన్నతక్కడ్‌పల్లి గ్రామం మీదుగా వెళ్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం.. యువకుడి మృతి

- చేగుంట బైపాస్ వద్ద ఘటన


వడ్డేపల్లి వేణు (ఫైల్)

కామారెడ్డి రూరల్: బైక్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టిన ఘటనలో చిన్నమల్లారెడ్డికి చెందిన యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటన చేగుంట బైపాస్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన వడ్డేపల్లి వేణు, అతని స్నేహితుడు బోయిని రంజిత్ పని నిమిత్తం ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లారు. పని ముగించుకుని వేణు అక్కడే ఉన్న తన బంధువును కలిశాడు. అప్పటికే రాత్రి కావడంతో అక్కడే ఉండిపోయి సోమవారం ఉదయం బంధువు బైక్ తీసుకుని ఇద్దరు బయల్దేరారు. ఈ క్రమంలో చేగుంట బైపాస్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో వేణు(24) అక్కడికక్కడే మృతి చెందగా రంజిత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

ఇంట్లో గొడవపడి ఆత్మహత్య

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన కర్నె శంకర్(30) తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు. మద్యానికి బానిసైన శంకర్ ఆదివారం సైతం మద్యం సేవించి భార్య మాధవి, తల్లి సావిత్రితో గొడవపడ్డాడు. చనిపోతానంటూ బెడ్‌రూంలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. కొద్ది సేపటి తరువాత కిటికీలో నుంచి చూడగా శంకర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడు గతంలోపలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని పురుగుల మందు తాగాడని ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భార్యకు ఫోన్ చేసి చెరువులో దూకి..

నవీపేట: మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన గౌరు ప్రదీప్(35) అనే వ్యక్తి ఆదివారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన ప్రదీప్ తరచూ భార్య మీనతో గొడవపడేవాడని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి తాగిన మైకంలో చెరువు వద్దకు వెళ్లి భార్యకు ఫోన్ చేసి చెరువులో దూకాడని తెలిపారు. రాత్రి వేళలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ప్రదీప్ ఆచూకీ లభించలేదని, సోమవారం ఉదయం మృతదేహం నీటిపై తేలిందన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


కాశీం(ఫైల్)

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామానికి చెందిన మహ్మద్ కాశీం సోమవారం ఉదయం రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి పక్కన ఉన్న రైల్వే ట్రాక్ దాటి వెళ్లిన కాశీం తిరిగి ఇంటికి వస్తూ పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన కాశీం ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన తోడేటి నర్సింలు(47) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందినట్లు ఏఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. వరి కోయించేందుకు కుమారులతో కలిసి నర్సింలు సోమవారం పొలానికి వెళ్లాడు. కోత యంత్రం రాకపోవడంతో కుమారులు ఇంటికి వెళ్లిపోగా.. నర్సింలు రాత్రి వరకు వెళ్లలేదు. దీంతో ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి పక్కనే చెరువులో మృతదేహం తేలింది. నర్సింలుకు గతంలో ఫిట్స్ వచ్చేదని చెరువులోకి స్నానానికి వెళ్లడంతో ఫిట్స్ వచ్చి అక్కడే మృతి చెందాడని భార్య లక్ష్మి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..

రామారెడ్డి: మండల కేంద్రానికి చెందిన భవానీపేట రాజయ్య,(77) ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. ఆదివారం రాత్రి తన పొలం కౌలు చేస్తున్న కన్నాపూర్ తండాకు చెందిన భాష్‌సింగ్‌తో కలిసి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కుప్పలు పోసి ఆ తర్వాత భాష్‌సింగ్ ఇంటి ముందు అరుగుపై కూర్చొని తింటుండగా ఛాతినొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బాలనర్సవ్వ రాజయ్య మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ • ప్రజావాణికి 69 ఫిర్యాదులు



కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 69 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించడం గానీ, తమ పరిధిలో పరిష్కారాలు లేకుంటే ఉన్నతాధికారులకు నివేదించడంగానీ చేయాలన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్ రెడ్డి, వి.విక్టర్, ఆర్డీవో రంగనాథ్ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీబీపేట్ కేజీబీవీ ఎస్‌వోను సస్పెండ్ చేయాలి



కామారెడ్డి టౌన్: బీబీపేట్ కస్తూర్బా గాంధీ విద్యాలయం ఎస్‌వో అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. విద్యార్థులకు సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా, నాసిరకం, పురుగుల అన్నం పెడుతున్నారని, విద్యార్థుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే జిల్లాలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి విఠల్, జిల్లా ఇన్‌చార్జి పెరుమాండ్ల బుల్లెట్, ఉపాధ్యక్షుడు అర్బాస్ ఖాన్, ప్రభాకర్, శివ తదితరులున్నారు. బీబీపేట కేజీబీవీ ఎస్‌వోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఆర్మూర్‌లో ఆక్రమణల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ నుంచి మామిడిపల్లి వరకు రోడ్డును ఆక్రమించిన ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు, షెడ్డులను పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారుల సమక్షంలో తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమించినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఆటోలను సైతం రోడ్లపై నిలిపితే జరిమానా విధిస్తామన్నారు. బస్టాండ్ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుందని, ట్రాఫిక్ స్తంభించకుండా వ్యాపారులు, ఆటోవాలాలు సహకరించాలన్నారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.